క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం



రెంటచింతల: మండలంలోని పశర్లపాడు, మిట్టగుడిపాడు గ్రామాల సంబంధించిన 11 కేవీ పరిధిలోని ఫీడర్లకు మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ట్రాన్స్‌కో ఏఈ షేక్ మస్తాన్‌వలి తెలిపారు. సోమవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో మాచర్ల–దాచేపల్లి బైపాస్ రోడ్డు (ఎన్‌హెచ్–167 ఏడీ) నిర్మాణ పనులు ఈ రెండు ఫీడర్ల పరిధిలో చేపట్టడం వలన విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందన్నారు. ఆయా గ్రామాల ప్రజలు స్థానిక విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల కృషి అమూల్యం



మాచర్ల రూరల్: శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు చేస్తున్న కృషి అమూల్యమని వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ అధ్యక్షుడు ఓరుగంటి చెన్నకేశవరావు అన్నారు. సోమవారం రూరల్ సర్కిల్ కార్యాలయంలో నూతనంగా నియమితులైన రూరల్ సీఐ కె.సురేష్‌ను సన్మానించి వారు మాట్లాడారు. పోలీసులకు వాసవి క్లబ్ సేవలు అవసరమైతే తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని చెప్పారు. సేవే లక్ష్యంగా పనిచేస్తున్న క్లబ్ సభ్యుల కృషిని రూరల్ సీఐ సురేష్ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్లు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, పోలిశెట్టి పిచ్చయ్య, చందోలు నాగేశ్వరరావు, సెక్రటరీ పందిరి నరసింహారావు, సెక్రటరీ చుండూరు సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ బచ్చు రాజ్‌కుమార్ తదితరులున్నారు.

కరాటే పోటీల్లో సత్తెనపల్లి విద్యార్థుల ప్రతిభ



సత్తెనపల్లి: బాపట్లలోని టీటీడీ కల్యాణ మండపంలో గత ఆదివారం జరిగిన కరాటే ఇంటరేట్ చాంపియన్ షిప్ టోర్నమెంటులో సత్తెనపల్లికి చెందిన షీకాకాయ్ షిటోరియో కరాటే స్కూలు విద్యార్థులు 22 మంది ప్రతిభ చూపారు. బ్లాక్ బెల్ట్ విభాగంలో జీటీ జశ్విత, ఎం.రామబ్రహ్మాచారి చాంపియన్స్‌గా నిలిచారని స్కూల్ ప్రతినిధులు తెలిపారు. వ్యక్తిగత బాలికల కటా విభాగంలో జీటీ జశ్విత(14), టి.నిఖిత(13), అక్షయ(8), ఎస్.ఎస్.ఎస్.అక్షర(10), బ్రాంజ్‌లో ఎస్.శరణ్య(13), వ్యక్తిగత బాలుర కటా విభాగంలో డీఎంఎస్ రామబ్రహ్మాచారి(15), గోల్డ్‌లో బి.బాలాజీ(11), ఎల్.గేష్ను(10),టి.అఖిల్(12), బి.లోకేష్(12), సిల్వర్‌లో.. టి. నాగనితీష్నాయుడు(8), సీహెచ్.జస్వంత్(12), పీఎస్ఎన్ చరణ్(14), బ్రాంజ్‌లో పీఎన్వీ సుఖేత్(15), బి.టిషాంత్(9), ఎ.ధనుంజయ్(9), పీఎస్ కార్తికేయ(10), బి.సత్యన్నారాయణ(11), కె.తేజా ప్రకాష్(10), ఎల్.కిరీట్, వి.దివీస్(11), వి.అభినవ్(13) ప్రతిభ చూపారని తెలిపారు. విద్యార్థులను షిహాన్ అనుముల రాంబాబు, అనుముల రామయ్య సోమవారం ప్రత్యేకంగా అభినందించారు.

వేద గాయత్రి పురోహిత సంఘ అధ్యక్షుడిగా రాజశేఖర్



సత్తెనపల్లి: వేద గాయత్రి పురోహిత సంఘ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన అంపిరాయని రాజశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని నరసరావుపేట రోడ్‌లో గల శ్రీలక్ష్మీ తిరుపతమ్మ దేవాలయం వద్ద సోమవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. సెక్రటరీగా అత్తులూరి అనీల్ కుమార్, ట్రెజరర్‌గా పున్నావఝుల సీతారామశాస్త్రి ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గం 2024–26 వరకు పనిచేస్తుంది. కార్యక్రమంలో పురోహితులు ఉన్నారు.

1,300 ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు

క్రోసూరు: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని క్రోసూరు, అచ్చంపేట, బెల్లంకొండ మండలాల్లోని రెండు, పెదకూరపాడు మండలంలోని రెండు గ్రామా సచివాలయల నుంచి ఇప్పటి వరకు 1,300 జగనన్న ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్లు జరిగినట్లు సబ్ రిజిస్ట్రార్ బి. భాస్కరరావు సోమవారం తెలిపారు. సర్వర్ సమస్య తీవ్రంగా ఉండటంతో కొన్ని సచివాలయాల్లో ఆలస్యంగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని ఆయా కార్యదర్శులు తెలిపారు.

శరవేగంగా రిజిస్ట్రేషన్‌లు

సామాన్యుడిపై రూపాయి భారం లేదు.. లంచాలు ఇవ్వాలన్న భయం లేదు.. నిరుపేద లబ్ధిదారులకు ఇచ్చిన ఇంటి పట్టాకు ఉచిత రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి..ఎక్కడో దూరంగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లే అవసరం లేకుండా ఇంటి పక్కనే ఉన్న వార్డు, గ్రామ సచివాలయాల్లో పైసా ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్లు ముమ్మరంగా చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు జరగటం పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

- గురజాల సబ్ రిజిస్ట్రార్ పరిధిలో 9,249 మంది లబ్ధిదారులు
- నేటి వరకు 2,289 మందికి రిజిస్ట్రేషన్ పూర్తి



కేసానుపల్లి సచివాలయంలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ చేస్తున్న దృశ్యం

గురజాల/దాచేపల్లి: నియోజకవర్గంలో జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ శరవేగంగా జరుగుతుంది. లబ్ధిదారులందరికి రిజిస్ట్రేషన్‌లు పూర్తి చేసి వారికి పూర్తి హక్కులు కలుగజేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రతి ఒక్కరికి రిజిస్ట్రేషన్ చేసి వారికి హక్కు పత్రాలు అందజేస్తున్నారు. అన్ని మండలాల్లో ఇందుకు గాను ప్రత్యేక ఏర్పాట్లు చేసి ప్రక్రియ ప్రారంభించారు. గ్రామాల్లో ఎక్కడికక్కడ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. గురజాల, దాచేపల్లి, రెంటచింతల, దుర్గి, కారెంపూడి పరిధిలో 9,249 మంది లబ్ధిదారులకు గాను గత నాలుగు రోజుల నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుంది. ఇప్పటివరకు 2,289 మందికి రిజిస్ట్రేషన్‌లు చేసి పట్టాలు అందించారు.

మండలాల వారీగా ఇలా...

గురజాల సబ్ రిజిస్ట్రార్ పరిధిలో గురజాల, దాచేపల్లి, రెంటచింతల, దుర్గి, కారెంపూడి మండలాలు కలవు. వాటి పరిధిలో రిజిస్ట్రేషన్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 35 గ్రామాలకు గాను 51 గ్రామ, వార్డు సచివాలయాలను ఎంపిక చేసింది. ఆయా సచివాలయాల పరిధిలో సబ్ రిజిస్ట్రార్ పర్యవేక్షిస్తున్నారు. ఎప్పటికప్పుడు ఎన్ని రిజిస్ట్రేషన్‌లు జరుగుతున్నాయి సచివాలయాల్లో సిబ్బంది అందుబాటులో ఉన్నారా లేరా అనేది పరిశీలిస్తున్నారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఎలాంటి అంతరాయం ఏర్పడినా సంబంధిత సిబ్బంది అప్పటికప్పుడు సమస్యను పరిష్కరిస్తున్నారు. దాచేపల్లిలో–441, దుర్గి–121, గురజాల–971, కారెంపూడి–687, రెంటచింతలలో–69 మందికి రిజిస్ట్రేషన్‌లు పూర్తి చేసి వారికి పత్రాలు అందించారు.

వందశాతం పూర్తి చేస్తాం...



సచివాలయాల్లో వంద శాతం రిజిస్ట్రేషన్‌లు పూర్తి చేసే విధంగా చర్యలు చేపడుతున్నాం. సచివాలయాల్లో జగనన్న ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతంగా జరుగుతుంది. చిన్న చిన్న సమస్యలు ఉంటే సత్వరమే మా సిబ్బంది సచివాలయాలకు వెళ్లి పరిష్కరిస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో, తహసీల్దార్‌లు కూడా పర్యవేక్షిస్తున్నారు.

– బి.అశోక్, గురజాల సబ్ రిజిస్ట్రార్

స్థలంపై మాకు హక్కు వచ్చింది...



కేసానుపల్లిలో నాకు సెంటున్నర స్థలం ఇచ్చి పట్టాను అందించారు. పట్టా ఇచ్చేటప్పుడు ఉచితంగానే ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసి ఇస్తుందని చెప్పారు. నాకు ఇంటి స్థలం పట్టా ఇచ్చి, రిజిస్ట్రేషన్ ఉచితంగా చేశారు. ప్రభుత్వం ఇచ్చిన స్థలంపై నాకు సర్వ హక్కులు కల్పించారు. పేదల ప్రభుత్వం అనేదానికి నిదర్శనంగా ఈ ప్రభుత్వం నిలుస్తుంది.

– చెట్టిపాగు భాగమ్మ, కేసానుపల్లి

జగనన్న మాట నిలబెట్టుకున్నాడు...



ఇంటి స్థలం నాకు వస్తుందో రాదో అనుకున్నాను. నిరుపేదనైన నాకు జగనన్న ప్రభుత్వం ఉచితంగా ఇంటి స్థలం ఇచ్చింది. ఇప్పుడు రూపాయి ఖర్చు లేకుండా నాకు ఇచ్చిన స్థలం రిజిస్ట్రేషన్ చేశారు. ఎన్నికల ముందు జగనన్న మాకు ఏది చెప్పాడో..ఇప్పుడు అదే చేసి చూపించాడు. మాకు ఇచ్చిన స్థలాలకు రూ.30 వేలు ఖర్చు చేస్తేనే రిజిస్ట్రేషన్ అవుతుంది. కానీ రూపాయి ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్ చేసి ఆ భారం మామీద పడకుండా జగనన్న చేశాడు.

– వినుకొండ అన్నమ్మ, కేసానుపల్లి

జగన్‌కి జీవితాంతం రుణపడి ఉంటాం...



సీఎం జగనన్న నిరుపేదల పట్ల సహృదయం కలిగి ఉన్నాడు. గత ప్రభుత్వంలో ఇంటి స్థలం ఇవ్వటమే కష్టంగా ఉంది. కానీ ఈ ప్రభుత్వంలో ఇంటి స్థలం ఇచ్చి పట్టా కూడా ఇచ్చారు. ఇప్పుడు రిజిస్ట్రేషన్ కూడా ఉచితంగా చేశారు. నిరుపేదలకు మంచి చేస్తున్న సీఎం జగన్‌కి జీవితాంతం రుణపడి ఉంటాం. పేదలపై భారం పడకుండా అన్నీ ప్రభుత్వమే భరిస్తుంది.

– తలిశెట్టి మంగమ్మ, కేసానుపల్లి

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల ఐసీడీఎస్ కార్యాలయం పరిధిలో రెండు అంగన్‌వాడీ కార్యకర్తలు, నాలుగు అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తులు ప్రభుత్వం ఆహ్వానిస్తున్నట్లు పిడుగురాళ్ల సీడీపీవో శ్రీవల్లి సోమవారం తెలిపారు. మండలంలోని జానపాడు ఎస్టీ కాలనీలో, మాచవరం మండలంలోని కొత్తపాలెం బీసీ కాలనీలో జనరల్ కోటాలో అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉన్నాయని అర్హులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అలాగే పిడుగురాళ్ల పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో, మండలంలోని తుమ్మలచెరువు గ్రామంలోని అంజనాపురంలో, మాచవరం మండలంలోని పిన్నెల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో, కొత్తగణేశునిపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో జనరల్ కోటాలో అంగన్‌వాడీ సహాయకురాలు జనరల్ కోటాలో పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు 10వ తరగతి పాసై ఉండాలని, 21 నుంచి 30 సంవత్సరాలలోపు వసయసు ఉండాలని, స్థానికంగా ఉంటు, వివాహితులై ఉండాలన్నారు. అంగన్‌వాడీ సహాయకురాలుకు 7వ తరగతి పాసై ఉండాలని పేర్కొన్నారు. సంబంధిత పత్రాలతో ఈనెల 12వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు నేరుగా పిడుగురాళ్ల పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయలో దరఖాస్తులు అందించాలని తెలిపారు.

ఆర్డీవో కార్యాలయ ఏవోగా హుస్సేన్

సత్తెనపల్లి: సత్తెనపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయ ఏవోగా షేక్ మొహ్మద్ హుస్సేన్ నియమితులయ్యారు. ఆయన కావలి ఆర్డీఓ కార్యాలయ ఏవోగా విధులు నిర్వహిస్తూ సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడికి రానున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏవోగా పని చేసిన టి.మస్తాన్‌రావు ప్రకాశం జిల్లా రాచర్ల తహసీల్దారుగా బదిలీపై వెళ్లారు.

పల్నాడుకు పేరుప్రతిష్టలు తీసుకురావాలి



మెమెంటోను అందజేస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

దుర్గి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా మెగా టోర్నమెంట్‌లో ముటుకూరు ఒకటవ సచివాలయం పరిధిలోని పురుషుల ఖోఖో జట్టు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో జట్టు సభ్యులను ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అభినందించి, మెమెంటో బహూకరించారు. ఈ సందర్భంగా పీఆర్కే మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం విజయవంతం కావడంపై హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి క్రీడాకారులను ప్రోత్సహించడం సీఎం జగన్‌కే చెల్లిందన్నారు. విశాఖ వేదికగా ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు జరగనున్న ఫైనల్స్‌లో ముటుకూరు ఖోఖో జట్టు విజేతగా నిలిచి, పల్నాడు ప్రాంతానికి పేరుప్రఖ్యాతులు తేవాలని పీఆర్కే ఆకాంక్షించారు.

దుర్గి తహసీల్దార్‌గా రజనీకుమారి



తహసీల్దార్ రజనీకుమారిని సన్మానిస్తున్న సిబ్బంది

దుర్గి: దుర్గి మండల నూతన తహసీల్దార్‌గా జి.రజనీకుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆమె బాధ్యతలు చేపట్టి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆమె ప్రకాశం జిల్లా మద్దిపాడు నుంచి ఎన్నికల బదిలీల్లో భాగంగా స్థానిక కార్యాలయానికి వచ్చారు. గతంలో తహసీల్దార్‌గా పని చేసిన జి.రమేష్‌కుమార్ ప్రకాశం జిల్లాలోని మార్కాపురంకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన తహసీల్దార్ రజనీకుమారిని డీటీ ఐ.ఫణీంద్రకుమార్, సీనియర్ అసిస్టెంట్ నిర్మల, ఆపరేటర్ అనిల్‌శాస్త్రి, వీఆర్‌వోలు, వీఆర్‌ఏలు, కార్యాలయ సిబ్బంది సత్కరించారు.

కారెంపూడి తహసీల్దార్‌గా జయవర్ధన్

కారెంపూడి: కారెంపూడి మండల తహసీల్దార్‌గా బి.జయవర్ధన్ రానున్నారు. ఆయన ప్రకాశం జిల్లా కనిగిరి ఆర్డీవో ఆఫీస్‌లో ఏవోగా పని చేస్తూ ఎన్నికల బదిలీల్లో భాగంగా కారెంపూడి తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. మంగళవారం లేదా బుధవారం జయవర్ధన్ బాధ్యతలను స్వీకరించనున్నారని తెలుస్తోంది. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ శ్రీనివాస్ విధుల నుంచి శనివారమే రిలీవ్ అయ్యారు.

రెంటచింతల తహసీల్దార్‌గా రామ్‌మోహన్‌రావు

రెంటచింతల: మండల తహసీల్దార్‌గా ఎస్.రామ్‌మోహన్‌రావును నియమిస్తూ పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలం తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన తహసీల్దార్ కట్టేకోట పుల్లారావును తిరుపతి జిల్లాకు బదిలీ చేస్తూ భూ పరిపాలన చీఫ్ కమిషనర్ సాయి ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎన్నికల సంఘం సూచనల మేరకు స్థానిక జిల్లాల నుంచి ఇతర జిల్లాలకు బదిలీల నేపథ్యంలో తహసీల్దార్ పుల్లారావును తిరుపతికి బదిలీ చేయగా గూడూరు డివిజన్ బాలయ్యపల్లి మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు.

మహిళా పక్షపాతి సీఎం జగన్

- ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి
- దుర్గి మండలంలో రూ.26.91కోట్లు డ్వాకా మహిళలకు రుణమాఫీ



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

దుర్గి: మహిళలు వారి కాళ్ల మీద వారు నిలబడేటట్లు జీవనోపాధి మెరుగుపరచి మహిళాభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ ఆసరా చెక్కులను డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు పంపిణీ చేశారు. మండల పరిధిలోని 813 స్వయం సహాయక సంఘాలలోని 8,130 సంఘ సభ్యులకు రూ.6.72కోట్ల చెక్కులను అందజేశారు. ఇప్పటి వరకు గతంలో మూడు విడతలు కలుపుకొని మొత్తం మండల పరిధిలో రూ. 26.91కోట్లు నగదును డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు అందజేయటం జరిగిందని గణాంకాలతో వివరించారు. మహిళల కోసం అమ్మ కడుపులోని ఆడబిడ్డ నుంచి ఆప్యాయంగా ఆశీర్వదించే అవ్వ వరకు ప్రతి ఒక్కరి అవసరాలను గుర్తించి అనేక కార్యక్రమాలను చేపట్టారని, అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, చేయూత, సున్నా వడ్డీ, ఇళ్ళ పట్టాలు, కళ్యాణమస్తు, నామినేటెడ్ పదవుల్లో 50శాతం కేటాయించడంతో పాటు మహిళల కోసం దిశ యాప్, దిశ పోలీసు స్టేషన్‌లు వంటివి అనేక కార్యక్రమాలు గడిచిన 4 సంవత్సరాల 10 నెలల కాలంలో మనందరి ప్రభుత్వంలో చేపట్టడం జరిగిందన్నారు.

ప్రమాదాలతో కుటుంబాలు ఛిన్నాభిన్నం



ఎస్‌ఐ వెంకట నారాయణరెడ్డి

రెంటచింతల: నిర్లక్ష్యంగా ఆటోలను నడపడం ద్వారా జరిగే ప్రమాదాలతో అనేక కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతాయనే విషయాన్ని ప్రతి ఆటోవాలా గుర్తించాలని ఎస్‌ఐ కె.వెంకట నారాయణరెడ్డి అన్నారు. సోమవారం రెంటచింతలలో ఆటోవాలాలకు కౌన్సెలింగ్ ఇచ్చి మాట్లాడారు. ట్రాఫిక్ నియమ నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటున్న ఆటోవాలాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం ఎక్కువగా ఆటో ప్రమాదాలు జరుగుతున్నాయని మీరు గమనిస్తున్నారా.. ఇంటి దగ్గర ఒక కుటుంబం ఆధారపడి ఉందనే విషయం గుర్తుంచుకోవాలని సూచించారు. డ్రైవింగ్ చేయడానికి వీలులేకుండా గ్రామాలలో 15 నుంచి 25 మంది వ్యవసాయ కూలీలతో ఆటోలను నడుపుతున్నారని ఇలా నడపడం చాలా ప్రమాదకరమన్నారు. ప్రమాదాలను నివారించడంలో వాహనదారులు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ప్రతి ఒక్కరికి డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలన్నారు. లైసెన్స్ లేకపోవడం వలన అనేక ఇబ్బందులు పడాల్సివస్తుందని వివరించారు. ఆటో నడిపే సమయంలో కచ్చితంగా యూనిఫాం ధరించాలన్నారు. ఆటోలను అతివేగంగా నడిపితే వారిపై కేసులు నమోదు చేసి భారీగా జరిమానా విధించడం జరుగుతుందన్నారు. రెంటచింతలలో మీకు కేటాయించిన ప్రాంతంలో మాత్రమే ఆటోలను నిలుపుకోవాలని, ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పార్టీలో కష్టపడిన వారికి తప్పక గుర్తింపు

ప్రభుత్వ విప్ పీఆర్కేని సన్మానించిన కారెంపూడి ఎంపీపీ



ప్రభుత్వ విప్ పీఆర్కేకు జ్ఞాపిక అందిస్తున్న కారెంపూడి ఎంపీపీ సావిత్రి, పార్టీ నాయకులు

కారెంపూడి: కారెంపూడి ఎంపీపీగా పదవీ ప్రమాణం చేసిన బొమ్మిన సావిత్రిఅల్లయ్య ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు పిన్నెల్లి వెంకటరామిరెడ్డిలను సోమవారం మాచర్ల వెళ్లి కలసి తనకు పదవి బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ విప్ రామకృష్ణారెడ్డి, వెంకటరామిరెడ్డిలను ఎంపీపీ, పార్టీ నాయకులు ఘనంగా సన్మానించి, పీఆర్కే సోదరులు కలసి ఉన్న చిత్రపటాన్ని జ్ఞాపికగా బహూకరించారు. వైఎస్సార్‌సీపీ కష్టపడి పని చేసిన వారికి తప్పక గుర్తింపు వస్తుందనే దానికి తానే నిదర్శనమని ఎంపీపీ పేర్కొన్నారు. ఇచ్చిన మాట తప్పని నేత రామకృష్ణారెడ్డి అని అన్నారు. ఆయన అడుగు జాడలలో నడచి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. పార్టీ నాయకులు పంగులూరి రామకృష్ణయ్య, మండల పార్టీ అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం, పాతూరి రామిరెడ్డి, అల్లు వెంకటేశ్వరరెడ్డి, జక్కిరెడ్డి నాగిరెడ్డి, బైరెడ్డి బసివిరెడ్డి, అలుగునూరి అమరయ్య, జొన్నలగడ్డ శ్రీను, షేక్ సైదా తదితరులున్నారు.

విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత



విద్యార్థికి లాప్‌టాప్ అందజేస్తున్న ఎంఈఓ నరసింహారావు

అచ్చంపేట: ప్రతిభ ఉండి ఆర్థిక స్థోమత లేని నిరుపేద విద్యార్థులకు స్నేహహస్తాలు ఫౌండేషన్ అందిస్తున్న సహకారం, సేవలు అభినందనీయమని ఎంఈవో రావిపాటి నరసింహారావు అన్నారు. మాదిపాడు పంచాయతీ పరిధిలోని జడపల్లి తండాకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి బాణావత్ అంజన్ కుమార్ నాయక్‌కు ప్రాజెక్టు వర్క్ నిమిత్తం రూ.40వేలు విలువ చేసే ల్యాప్‌టాప్‌ను స్నేహహస్తాలు ఫౌండేషన్ దాతృత్వంతో సోమవారం ఆయన అందచేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. ఫౌండేషన్ ద్వారా ఎందరో నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువుకు లాప్‌టాప్‌లు ఇస్తూ.. ఫీజులు చెల్లిస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలలకు ఫర్నీచర్‌ను సరఫరా చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో చెరుకుంపాలెం గ్రామాభివృద్ధి చైర్మన్ తుమ్మా శౌర్రెడ్డి, ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ తాయి కరిముల్లా బాబు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ద్వారా ఆరోగ్య పరిరక్షణ



జమ్మలమడకలో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

మాచర్ల రూరల్: పరిసరాల పరిశుభ్రత ద్వారానే ఆరోగ్యాలను పరిరక్షించుకోవచ్చునని ప్రతి ఒక్కరూ తడి, పొడి చెత్తలను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని సర్పంచ్ ముక్కా గురవయ్య కోరారు. సోమవారం మండలంలోని జమ్మలమడక గ్రామంలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించి ఆయన మాట్లాడారు. గ్రామాల అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలు తీసుకొచ్చారని, గ్రామాల పరిశుభ్రత కోసం వీధుల్లో సంచరించే చెత్త బండ్లకు చెత్తను అందించాలని, అలాగే కాలువలలో చెత్తను వేయకుండా ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో మురికితీత పనులు చేపట్టి, బ్లీచింగ్, దోమల నివారణకు ఫాగింగ్ వంటివి చేపట్టారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ డి.మురళీధర్, ఏఎన్‌ఎం కోటేశ్వరి, స్వరూప, మేరి, మంగమ్మ, తిరుపతమ్మలున్నారు.

నగర పంచాయతీ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా రాధాకృష్ణమూర్తి

గురజాల : నగర పంచాయతీ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా దివాకరుని రాధాకృష్ణమూర్తి నియమితులయ్యారు. సోమవారం నగర పంచాయతీ కమిషనర్ అన్నదాత మోహన శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. నగర పంచాయతీ చైర్ పర్సన్ పోలు పవన్మయివీరారెడ్డి చేతులమీదుగా నియామక పత్రం అందుకున్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన దివాకరుని రాధాకృష్ణమూర్తిని బ్రాహ్మణ సంఘం నాయకులు రెంటాల నాగేశ్వరరావు, మద్దాలి రాంబాబు, గాదె వెంకట కృష్ణయ్య, స్వర్ణ లక్ష్మణ్, జూలకంటి పద్మనాభశర్మ, లక్ష్మీనారాయణ ప్రసాద్, నారాయణభట్ల సుబ్రమణ్యం తదితరులు సత్కరించారు.

ఆర్డీవోను కలిసిన కౌన్సిలర్ల బృందం

సత్తెనపల్లి: సత్తెనపల్లి ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన వి.మురళీకృష్ణను మున్సిపల్ కౌన్సిలర్ల బృందం, వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, కౌన్సిలర్లు అచ్యుత శివప్రసాద్, అవ్వారు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బండి మల్లికార్జునరెడ్డి, దేవరశెట్టి రవికుమార్, రేపూడి రవితేజ, పెద్దింటి వెంకటేశ్వర్లు, మాదికొండ నారాయణ, షేక్ మహ్మద్ గని, సంకుల తిరుమలరావు, కాటుమాల డేవిడ్ ఉన్నారు.

క్రోసూరు ఎస్‌ఐగా షేక్ షఫీ

క్రోసూరు: మండల ఎస్‌ఐగా షేక్ షఫీ బదిలీ అయినట్లు పోలీస్ స్టేషన్ సిబ్బంది దాసు సోమవారం తెలిపారు. షఫీ గుంటూరు సీసీఎస్ నుంచి ఇక్కడకు వస్తున్నట్లు చెప్పారు. త్వరలో విధుల్లో చేరతారని పేర్కొన్నారు.